క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎస్పీ తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్ వద్ద గురువారం రాత్రి అన్ని వైపులా తనిఖీలు చేశారు. తనిఖీల అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ వెనుక వైపు తుమ్మలగుంట రోడ్డుకు ఉన్నటువంటి ప్రహరీ గోడ, ఔటర్ కార్డెన్ నుంచి ఎవరూ కూడా లోపలికి వెళ్లడానికి వీలు లేని విధంగా లోపల ఇనుప ముళ్ల కంచె, బారికేడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ చుట్టూ మూడు మొబైల్ పార్టీలతో నిరంతరం పెట్రోలింగ్ చేస్తున్నామని, లోపలికి ఎవరూ రాలేరని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతపై ఎవరు సందేహ పడాల్సిన అవసరం లేదని తనిఖీలు నిర్వహించిన అనంతరం జిల్లా ఎస్పీ తెలియజేశారు.

శ్రీకోదండరామస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో జూన్ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జూన్ 1, 8, 15, 22, 29వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. 6వ తేదీ అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడుతారు. ఇదే రోజు రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ జరుగనుంది. 9వ తేదీన పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళుతారు. సాయంత్రం 6.30 గంటలకు అక్కడ స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 22వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం జరుగనుంది. ఇదే రోజు సాయంత్రం 6.30 గంటలకు అక్కడ స్వామివారికి ఆస్థానం నిర్వహిస్తారు.

ఈసెట్‌లో సాయిమేధ ప్రతిభ



ర్యాంకులు సాధించిన సాయిమేధ విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ ఈసెట్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని సాయిమేధ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో బి.హేమనాథ్‌రెడ్డి ఈసీఈ విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు, వెంకటగణేష్ 6వ ర్యాంకు, షణ్ముఖశర్మ 7వ ర్యాంకు సాధించారు. ఈఈఈ విభాగంలో కె.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు, సి.రాజేష్ 12వ ర్యాంకు, ఎస్.సాయిగిరినాథ్‌రెడ్డి 13వ ర్యాంకు, పి.చేతన్‌ఆనంద్ 20వ ర్యాంకు, మెకానికల్ విభాగంలో బి.ధర్మేంద్ర రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు, ఎం.సునీల్ శెట్టి 11వ ర్యాంకు, హేమంత్‌సాయి 14వ ర్యాంకు, సివిల్‌లో ఈశ్వర్ సాయిరాజా 8వ ర్యాంకు, ఎం.వివేకానందరెడ్డి 13వ ర్యాంకు, జి.మధు 18వ ర్యాంకు, కంప్యూటర్స్ విభాగంలో కె.నందిని 15వ ర్యాంకు, ఎస్.వెంకటప్రసన్న 18వ ర్యాంకు సాధించారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆ సంస్థ డైరెక్టర్ జి.రమణ అభినందించారు.

ఈసెట్‌లో రాహుల్‌కు ఐదో ర్యాంకు



భాకరాపేట: ఏపీ ఈసెట్ ఫలితాల్లో చంద్రగిరి నియోజక వర్గం చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గుట్టావాండ్లపల్లెకు చెందిన సుజాత, హరిబాబు కుమారుడు ముదినేని రాహుల్ ఐదో ర్యాంకు సాధించాడు. రాహుల్ కలికిరిలో అగ్రికల్చర్ డిప్లొమా చేశాడు.

గుర్తు తెలియని మృతదేహం

తిరుపతి రూరల్: సాయినగర్ పంచాయతీలో గుర్తు తెలియని వ్యక్తి (54) మృతి చెందాడు. పంచాయతీలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు సమీపంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీసులకు అందించాలని సీఐ తమీమ్ అహ్మద్ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





ఒంటికి యోగా మంచిదేగా...

వేసవి సెలవుల్లో చిన్నారులు, విద్యార్థులు కొందరు విహార యాత్రల బాట పట్టారు. మరికొందరు చదువుల కోసం కోచింగ్ సెంటర్ల వైపు వెళుతున్నారు. మరికొందరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే యోగా, ఆటల పోటీల్లో బిజీగా గడుపుతున్నారు. అందులో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వుయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచితంగా యోగా, మెడిటేషన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా విద్యార్థులు యోగా నేర్చు కొంటున్న దృశ్యాలివి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నైపుణ్యాలపై పట్టు అవసరం



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఆర్‌వీఎస్ సత్యనారాయణ

తిరుపతి ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో అకడమిక్ చదువుతో పాటు నైపుణ్యాలపై పట్టు సాధించడం విద్యార్థులకు ఎంతో అవసరమని, తద్వారా గొప్ప అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఎస్వీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య పోటీ పరీక్షల విద్యా సంస్థ విద్యార్థులు 20 మందికిపైగా క్యాట్ తుది ఫలితాల్లో అత్యుత్తమ పర్సంటైల్ స్కోరు సాధించి దేశంలోని ప్రముఖ ఐఐఎంలలో అడ్మిషన్లు సాధించారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థలో గురువారం నిర్వహించిన అచీవర్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మరో అతిథి ఎస్వీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌వీఎస్.సత్యనారాయణ, కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు



కవాతు చేపడుతున్న ఎస్ఐ చిరంజీవి, ప్రత్యేక పోలీసు బలగాలు

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురం, నెన్నూరు, రావిళ్లవారిపల్లి, మహంతువారిపల్లి, సొరకాయలపాలెం గ్రామాల్లో ఎస్ఐ చిరంజీవి ప్రత్యేక పోలీసు బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ప్రతి ఇంటిని, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, హింసాత్మక దాడులను ప్రేరేపించేలా సందేశాలు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి శ్రీచంద్రమౌళీశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): రిషికేష్ ఆంధ్ర ఆశ్రమంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారి ఆలయంలో జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. జూన్ 1వ తేదీ సాయంత్రం అంకురార్పణ, మూషిక వాహనసేవ నిర్వహిస్తారని పేర్కొన్నారు. జూన్ 2న ఉదయం ధ్వజారోహణం, కల్పవృక్ష వాహనం, సాయంత్రం హంస వాహనం, 3న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 4న ఉదయం శేషవాహనం, సాయంత్రం గజవాహనం, 5న ఉదయం సింహ వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, వృషభ వాహనం, 6న ఉదయం త్రిశూల స్నానం, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కమిషనర్‌కు ఘన స్వాగతం



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్

తిరుపతి సిటీ: రాష్ట్ర కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌కు ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా రెండు రోజులపాటు ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో జరిగే రివ్యూ మీటింగ్‌కు గురువారం కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

బాల సాహిత్య సమ్మేళనంలో తిరుపతి రచయితలు

తిరుపతి కల్చరల్: తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో బాలల రచనలు రాస్తున్న ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల్లో బాల సాహిత్య కథలు, గేయాలు రాయిస్తూ బాలల నేస్తం మాస పత్రికను నిర్వహిస్తున్న బాల సాహితీ రచయితలు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి తిరుపతి జిల్లా నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల వికాసాభివృద్ధికి కృషి చేస్తున్న వారికి తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, నిర్వాహకుడు గరికపల్లి అశోక్ వారి కృషిని అభినందిస్తూ ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించి, అభినందించారు.



తిరుపతి రచయితలను ప్రశంసా పత్రంతో సత్కరిస్తున్న సారస్వత పరిషత్ ప్రతినిధులు